క్లుప్తంగా

రాజ్యాంగ దినోత్సవం



సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, సంగెం, పర్వతగిరి, నెక్కొండ, చెన్నారావుపేట, రాయపర్తి, తదితర మండలాల్లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంగెం మండలంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పాల్గొని ప్రజలు, నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యాసంస్థల్లో, ప్రధాన కూడళ్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడారు. పలు చోట్ల డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు.

మాజీ జెడ్పీటీసీకి అవార్డు



సంగెం : స్థానిక మాజీ జెడ్పీటీసీ గుగులోత్ వీరమ్మ సేవా రత్న అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ ఆడిటోరియంలో జూరిస్ట్ అవార్డును ఆమెకు తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ డాక్టర్ భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ అందజేసి అభినందించారు.

నియామకం



నర్సంపేట : జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధిగా పంజాల వెంకట్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ వెంకట్‌కు సంఘం జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నీలారపు నరేందర్ మంగళవారం నియామక పత్రం అందజేసి సన్మానించారు. అనంతరం సారయ్య, నరేందర్ మాట్లాడారు. వెంకట్ తెలంగాణ ఏర్పాటు కోసం ఉద్యమించారని చెప్పారు. అనేక ఉద్యమాల్లో భాగస్వాములయ్యారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోల్తి రవి, పట్టణ అధ్యక్షుడు జి.రవి, ఉపాధ్యక్షుడు చీర వెంకటనారాయణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి మల్లేశం, నాయకులు సోల్తి అనిల్, బైరి నాగరాజు, సంపత్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమితి కన్వీనర్‌గా..



సంగెం : తెలంగాణ ఉద్యమకారుల సమితి పరకాల నియోజకవర్గ కన్వీనర్‌గా మండలంలోని కాట్రపల్లి మాజీ సర్పంచ్ పూలుగు సాగర్‌రెడ్డి ఎన్నికయ్యారు. టీఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సాగర్‌ను ఎన్నుకున్నారు. అలాగే నియోజకవర్గ స్థాయి ఉద్యమకారుల సమన్వయ సభ్యులుగా రామచంద్రాపురం గ్రామానికి చెందిన బొంపల్లి దిలీప్‌రావు, కుంటపల్లికి చెందిన యార బాలకృష్ణ, జున్న రాజు, మండల కన్వీనర్‌గా నర్సానగర్‌కు చెందిన ఉండీల రాజు ఎన్నికయ్యారు.

బాధితులకు 'సఖి' సేవలు

దుగ్గొండి : బాధిత మహిళలు, బాలికలకు సఖి కేంద్రంలో అనేక సేవలు అందుతాయని లీగల్ అడ్వైజర్ శోభారాణి తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు, బాలికలపై హింస, అక్రమ రవాణా, తదితరాలపై అవగాహన కల్పించారు.

అభయనిధి, బీమా అందజేత

సంగెం : మండలంలోని కుంటపల్లిలోని ఏకశిల పురుషుల పొదుపు సంఘం సభ్యుడు చిర్ర యాకయ్య ఇటీవల మృతి చెందగా నామినీ అయిన అతడి సతీమణి మరియమ్మకు అభయనిధి, బీమా మొత్తం కలిపి రూ.లక్షా 219 నగదును స్థానిక సంఘ కార్యాలయంలో అధ్యక్షుడు కాగితాల జగన్నాథచారి ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మొగిలి, డైరెక్టర్లు ప్రకాశ్, చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : పట్టణానికి చెందిన ప్రగతి పత్రిక చైర్మన్ కాపరబోయిన శ్రీనివాస్ తల్లి లక్ష్మీకాంత మంగళవారం మృతి చెందగా ఆమె మృతదేహానికి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వల్లబ్‌నగర్‌కు చెందిన నాలం విజయ్‌కుమార్ తండ్రి పుల్లయ్య ఇటీవల మృతి చెందగా ఆయన చిత్రపటానికి రమేశ్ నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమాల్లో మోకుదెబ్బ జిల్లా సలహాదారు రామగోని సుధాకర్, అధ్యక్షుడు వెంకట్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి



వర్ధన్నపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు



వలసల నివారణే 'ఉపాధి' ధ్యేయం

- ఎమ్మెల్యేలు మాధవరెడ్డి, నాగరాజు, ప్రకాశ్‌రెడ్డి, యశస్వినిరెడ్డి
- ఆయకట్టు, ఫారం పాండ్, తదితర పనుల ప్రారంభం

సాక్షి నెట్‌వర్క్ : వలసల నివారణే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ధ్యేయమని నర్సంపేట, వర్ధన్నపేట, పాలకుర్తి, పరకాల ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కేఆర్.నాగరాజు, యశస్వినిరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ప్రజాపాలన–ప్రజావిజయోత్సవాల్లో భాగంగా మన ఊరు–పనుల జాతర కార్యక్రమంలో భాగంగా నర్సంపేట మండలంలోని మందపల్లి నుంచి లక్నేపల్లి వరకు చేపట్టిన ఆయకట్టు రోడ్డు పనులను ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, అలుగుబెల్లి నర్సింరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి ఎమ్మెల్యే మాధవరెడ్డి ప్రారంభించగా వర్ధన్నపేట మండలంలోని బండౌతాపురంలో కోనారెడ్డి చెరువు ఫీడర్ చానల్ మరమ్మతు పనులను స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు,



రాయపర్తి : ఫాం పాండ్ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి మండలంలోని రాగన్నగూడెంలో ఇల్లంద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన ఫాం పాండ్ నిర్మాణ పనులను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, గీసుకొండ మండలంలోని ఊకల్‌లో ఫారం పాండ్, సంగెం మండలంలోని కాట్రపల్లి శివారు వడ్డెరగూడెంలో పొలంబాట పనులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.



సంగెం : కాట్రపల్లిలో ఉపాధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

అధికారులపై ఎమ్మెల్యే మాధవరెడ్డి అసహనం

దుగ్గొండిలో అధికారుల తీరుపై ఎమ్మెల్యే మాధవరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. రైతుల కోసం ఏం పనులు చేశారు? ఎన్ని నిధులు ఖర్చు చేశారు? చెరువుల్లో చేసిన పనుల వివరాలేంటి? తెలియకుంటే ఎలా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, డీపీఓ కల్పన, జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మీ, ఆర్‌డీఓ ఉమారాణి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఆడదూడలతో పాడి రైతులకు లబ్ధి

- పశు వైద్యాధికారులు మంజీలాల్, రాధిక

చెన్నారావుపేట : ఆడదూడల జననంతో పాడి రైతులకు లబ్ధి చేకూరుతుందని చెన్నారావుపేట, ఉప్పరపల్లి పశు వైద్యాధికారులు మంజీలాల్, రాధిక తెలిపారు. మండలంలోని ఖాదర్‌పేటలో పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరంలో 86 పశువులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మంజీలాల్, రాధిక మాట్లాడారు. ఆడ దూడలకు జన్మనిచ్చేలా లింగ నిర్ధారణ చేసిన సెక్స్ సార్టెడ్ సెమెన్ పశు వైద్య శాలల్లో, గోపాలమిత్రల వద్ద అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ జహంగీర్, గోపాలమిత్రలు లక్ష్మీనారాయణ, కట్లెపు ప్రసాద్, రమేశ్, మధుకర్, ప్రసాద్, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని దూపతండాలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స, దూడల ప్రదర్శన, గాలికుంటు వ్యాధుల నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి డాక్టర్ రాజు పశువులకు పరీక్షలు



చెన్నారావుపేట : పశువుకు వైద్యం చేస్తున్న డాక్టర్లు



పర్వతగిరి : పశువుకు మందులు వేస్తున్న డాక్టర్

నిర్వహించి మందులు పంపిణీ చేసి మాట్లాడారు. సెక్స్ సార్టెడ్ సెమెన్‌ను పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ రఘువీర్, గోపాలమిత్రలు కుమారస్వామి, పి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

'అభ్యంతరాలుంటే తెలియజేయండి'

సంగెం : మండలంలోని ఓటర్ల జాబితా, వార్డులు, తదితరాలపై ఏవైనా అభ్యంతరాలంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను ఎంపీడీఓ రవీందర్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 33 గ్రామ పంచాయతీల పరిధిలో 41 వేల 771 మంది ఓటర్లున్నారని చెప్పారు. చిన్న పంచాయతీల్లో మొత్తం 286 వార్డులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కొమురయ్య, రాజకీయ పార్టీల ప్రతినిధులు బుట్టి కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఖానాపురం : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన వరంగల్–మహబూబాబాద్ జిల్లాల సరిహద్దులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా.. మండలంలోని కొత్తూరుకు చెందిన క్యాతం సాయి కుమార్ (25) ఫొటోగ్రాఫర్‌గా జీవనం సాగిస్తున్నారు. ఆయన కొత్తగూడ మండలంలోని గుంజేడుకు వెళ్లి రాత్రి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి చెట్టును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న యువకుడు..

సంగెం : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నెక్కొండ మండలంలోని నాగారం గ్రామానికి చెందిన గందం నరస్వామి (31) బతుకుదెరువు కోసం హనుమకొండ జిల్లా పరిధిలోని కొత్తపల్లిలో ఉంటూ నవారు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈనెల 17న పల్లారుగూడ శివారులో పురుగుల మందు తాగి తన బావకు వీడియో కాల్ చేసి తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తెలిపాడు. వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా సోమవారం రాత్రి మృతి చెందాడు.

హార్వెస్టర్ దగ్ధం

నల్లబెల్లి : మండలంలోని గొల్లపల్లిలో ప్రమాదవశాత్తు హార్వెస్టర్ కాలిపోయింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సంగ రంజిత్ వరి కోసేందుకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన గొల్లబోయిన అనిల్‌కు చెందిన హార్వెస్టర్ అద్దెకు తెప్పించాడు. మంగళవారం రాత్రి గొల్లపల్లి శివారులో కుంట రాజు వరి కోస్తుండగా ఇంజన్ ఆగిపోయింది. పానర్ సహాయంతో సెల్ఫ్ మోటర్ వైర్లను కలుపుతూ స్టార్ట్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. రైతులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాలేదు. హార్వెస్టర్ పూర్తిగా కాలిపోయింది.

ధార్మిక సదస్సులు ప్రారంభం

చెన్నారావుపేట : హిందూ ధర్మ ప్రచారం, తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్తంగా చేపట్టిన ఆధ్యాత్మిక సదస్సులు మండలంలోని ఉప్పరపల్లి గ్రామ శివాలయంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థాన బాధ్యులు ధాన్యం రంగనాథస్వామి ఆధ్యాత్మిక బోధనలు నిర్వహించారు. భక్తులకు కంకనాలు అందజేశారు. గ్రామస్తులతో కలిసి శ్రీరామ భజన, సంకీర్తన చేపట్టారు.

డేటా ఎంట్రీలో తప్పులుండొద్దు



సంగెం : డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న వేదవతి



పర్వతగిరి : డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న నీరజ

- ప్రత్యేక అధికారి వేదవతి

సంగెం : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేలో ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల ప్రత్యేక అధికారి వేదవతి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో డేటా ఎంట్రీని మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఆపరేటర్లు అప్రమత్తంగా ఉంటూ ఫారాల్లోని పూర్తి సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ కొమురయ్య, కార్యాలయ సూపరింటెండెంట్ ఓంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల పరిషత్ కార్యాలయంలో డేటా ఎంట్రీని మండల ప్రత్యేక అధికారి నీరజ పరిశీలించి మాట్లాడారు. సమాచార నమోదులో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్, ఎంపీఓ పాక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి అభిషేక పూజలు



అయ్యప్పస్వామికి పూజ చేస్తున్న అర్చకుడు దేవేశ్

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో అర్చకుడు తివారి అయ్యప్ప స్వామికి మంగళవారం అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో శెట్టి శ్రీదేవి ప్రభాకర్, మోక్షిత, పబ్బా పుష్పలీల సుదర్శన్, శింగిరికొండ రమాదేవి రవీందర్, సమర్థ కృష్ణ, మామిడాల సంపూర్ణ రమేశ్, అశ్వత్, కొణతం అరుణ నివాస్‌రెడ్డి, నల్ల పద్మ కమలాకర్‌రెడ్డి, ప్రవళిక ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాధవశంకర్ మాట్లాడారు. నేడు (బుధవారం) దొడ్డ అనసూయ ఉపేందర్ కుటుంబ సభ్యుల చేత దివ్య పడి పూజ, పుష్పాభిషేకం ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సైఫ సురేశ్, కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, భూపతి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలే శరణ్యం

నల్లబెల్లి : ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్య సమ్మయ్య తెలిపారు. మండల కేంద్రంలో బొడిగె సమ్మయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఆ పార్టీ మండల 3వ మహాసభకు సమ్మయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. మండల కార్యదర్శిగా కడియాల మనోహర్‌తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. తదనంతరం ఆ పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. తొలుత పార్టీ మండల కార్యదర్శి కడియాల మనోహర్ జెండా ఆవిష్కరించారు. మహాసభలో నాయకులు కడియాల వీరాచారి, ఇస్లావత్ రవి, కాల్‌నాయక్ పాల్గొన్నారు.

కూలి పెంచాలి

నర్సంపేట : వివిధ రంగాల్లో పని చేస్తున్న హమాలీలు, కార్మికుల పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం ప్రభుత్వాన్ని, కార్మిక శాఖను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీ రేట్ల ఒప్పందం ఈనెల 21తో ముగుస్తోందని చెప్పారు. ప్రస్తుత రేట్లపై 50 శాతం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. 50 ఏళ్లు నిండిన కార్మికులకు రూ.5 వేల చొప్పున పింఛన్ ఇవ్వాలని, ఇళ్లు లేని పేదలకు పక్కా ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మిల్ అండ్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రుద్రారపు ఎల్లన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత-ఇద్దరి అరెస్టు

నర్సంపేట రూరల్ : అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి కథనం ప్రకారం.., ఖానాపురం మండల కేంద్రానికి చెందిన పుల్లూరి రాజేశ్, గొట్టుకల నవీన్ 440 గ్రాముల ఎండు గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టణంలోని మహబూబాబాద్ రోడ్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ.11 వేలు ఉంటుందని, నిందితుల నుంచి సెల్‌ఫోన్‌తోపాటు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్‌కు చెందిన పోతరాజు మహేశ్‌కు చెందిన టెంట్ హౌజ్, డీజే సౌండ్స్ ఇటీవల అగ్ని ప్రమాదంలో దగ్ధం కాగా రాజుకు అతడి మిత్రులు మంగళవారం రూ.43 వేల 500 నగదు సాయం అందజేశారు. తొలుత రాజును అతడి మిత్రులు పరామర్శించారు.

రహదారిపైనే ధాన్యం ఆరబోత

- వాహనదారులకు తప్పని తిప్పలు
- కల్లాల్లేక రైతుల వెతలు

నర్సంపేట రూరల్ : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను రక్షించుకునేందుకు రైతన్నలు పండించిన పంటను జాతీయ రహదారిపైనే ఆరబోస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుని వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. కల్లాల్లేకనే రైతులకు వెతలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం, అధికారులు స్పందించి కల్లాలు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నర్సంపేట మండలంలోని నర్సంపేట–మల్లంపల్లి ప్రధాన రహదారిలోని 365వ నంబర్ జాతీయ రహదారిపై రాజుపేట, ముత్తోజిపేట, ఆకులతండా, ఇటుకాలపల్లి తదితర గ్రామాల రైతులు యథేచ్ఛగా వరిధాన్యం, మొక్కజొన్న ఆరబోస్తున్నారు. దీంతో రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏటా ఖరీఫ్, రబీలో సీజన్లలో ప్రయాణీకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కల్లాలు ఏర్పాటు చేయడంతోపాటు రైతులు రహదారులపై పంట ఉత్పత్తులు ఆరబోయకుండా అవగాహన కల్పించాలని ప్రజలు ఆశిస్తున్నారు.



ముత్తోజిపేటలోని జాతీయ రహదారిపై ధాన్యం

'ఉపాధి' కింద కల్లాల ఏర్పాటు



మండలంలోని 27 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద కల్లాలు నిర్మించాలని రెండేళ్లుగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. జాతీయ, ఇతర రహదారులపై ధాన్యం ఆరబోయడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పలుమార్లు రైతులకు అవగాహన కల్పించాం. ఎక్కువగా సన్న, చిన్నకారు రైతులే ఉండడంతో 3–5 గుంటల భూమిని కోల్పోయి కల్లాలు ఏర్పాటు చేసుకోవాలంటే ముందుకు రావడం లేదు.

– కృష్ణ కుమార్, ఏఓ, నర్సంపేట

దామాషా పద్ధతిలో ఇందిరమ్మ ఇళ్లు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి : వర్ధన్నపేట నియోజకవర్గంలో దామాషా పద్ధతిలో పేదలకు 3,500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు మంగళవారం ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. పేదలకు కల్యాణలక్ష్మిలో తులం బంగారం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, చెప్పారు. వచ్చే రబీ నాటికి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు బంధు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ సుశీల్‌కుమార్, చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు, మాజీ జెడ్పీటీసీ సింగ్‌లాల్, పద్మ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఉద్యోగులు

నైపుణ్యంతోనే వ్యాపారంలో ఉన్నతి

- కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న

పర్వతగిరి : రైతులు మాంసం నిల్వ చేసే పద్ధతులు, ఆధునిక యంత్రాలు, విలువ ఆధారిత మాంసం ఉత్పత్తుల వ్యాపారంలో నైపుణ్యం పెంచుకుంటేనే ఉన్నతి సాధించగలరని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రాజన్న తెలిపారు. మండల కేంద్రంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సౌజన్యంతో కేవీకే ఆధ్వర్యంలో మాంసం ఉత్పత్తులపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ అరుణజ్యోతి మాట్లాడుతూ రైతులకు మాంసం ఉత్పత్తుల వల్ల కలిగే ప్రయోజనాలు, మాంస ఉత్పత్తుల పరిశ్రమలు, వ్యాపార సరళిలో తెలుసుకోవాల్సిన అంశాలు వివరించారు. కార్యక్రమంలో సెర్ప్ డీపీఎం సరిత, ఏపీఎం కృష్ణమూర్తి, వ్యవసాయ అధికారి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్‌తో వరి సాగు మేలు

గీసుకొండ : యాసంగి వరి సాగులో డ్రమ్స్ సీడర్ లేదా నేరుగా వెదజల్లే పద్ధతితో రైతులకు మేలు జరుగుతుందని రైతు నేస్తం ప్రోగ్రాం అధికారి అనురాధ తెలిపారు. మండలంలోని కొనాయిమాకుల రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తొలుత ఎరువుల గోదాంను సందర్శించారు. అనంతరం గీసుకొండ, కొనాయిమాకుల, కొమ్మాల, మరియపురం, ధర్మారం గ్రామాల్లోని రైతు క్షేత్రాలను సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. యాసంగి వరి సాగుకు డిసెంబర్ 20 వరకు నారు పోసేందుకు అనుకూలమని చెప్పారు. యాసంగిలో స్వల్పకాలిక రకాలు మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ సోనా ఆర్‌ఎన్‌ఆర్ 15048, కేఎన్‌ఎం 1638, వరంగల్ 962, తదితరాలతోపాటు దొడ్డు రకాలైన జేజీఎల్ 24423, కేఎన్‌ఎం 118, ఆర్‌ఎన్‌ఆర్ 29325 రకాలు సాగుకు అనుకూలమని వివరించారు. డిసెంబర్ 20 తర్వాత విత్తితే అధిక ఉష్ణోగ్రత వల్ల నూక అధికంగా వచ్చే అవకాశం ఉందని, ఆకాల వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సారంగం, జాతీయ అహార భద్రత మిషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్సల్టెంట్ పి.హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరి : మాట్లాడుతున్న డాక్టర్ రాజన్న

ధాన్యంలో కోత విధిస్తే సహించేది లేదు

- వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్

నల్లబెల్లి : రైతులు తీసుకొచ్చే ధాన్యంలో తాలు పేరుతో కోత విధిస్తే సహించేది లేదని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండలంలోని రేలకుంట, లెంకాలపల్లి, నల్లబెల్లి గ్రామాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ–టీసెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ముప్పు కృష్ణతో కలిసి చైర్మన్ శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించొద్దని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరారు. ధాన్యం విక్రయించిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లను కొనుగోలు కేంద్రాల్లో అందజేస్తే ధాన్యం విక్రయించిన రెండ్రోజుల్లో డబ్బులు ఖాతాలో జమ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు వైనాల అశోక్, ఇస్తారి శేఖర్, ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జ్యోతి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తం సురేశ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఏడాకుల సంపత్ రెడ్డి, మదర్ తెరిస్సా మండల సమాఖ్య అధ్యక్షురాలు ఊటుకూరి భాగ్యలక్ష్మి, ఏపీఎం సునిత, పీఏసీఎస్ డైరెక్టర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

కళాజాతా

నల్లబెల్లి : మండలంలోని నల్లబెల్లి, లెంకాలపల్లి, నందిగామ గ్రామాల్లో సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు టీం లీడర్ నెల్లుట్ల సుమన్ ఆధ్వర్యంలో మంగళవారం కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు యోచన, తాళ్ల సునీల్, పడిదం రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని గుంటూరుపల్లి, గవిచర్ల, గొల్లపల్లి గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు జూపాక శివ, అంకం రామనాథం, హింగే అరవింద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.